# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గరిష్ఠం 32.0
కనిష్ఠం 24.4



## సూర్యాపేట

5

సోమవారం 30 సెప్టెంబరు 2024


ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.5050) | 588.90 (308.7614) | 36,163 | 43,024 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 644 (4.15) | 2,402.64 | 1,953.66 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 174.89 (45.77) | 31,285 | 36,957 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.250

# చెరువుల పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్




చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీల్లో చెరువులు, నీటి వనరులను రక్షించేందుకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా తరహా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అన్ని పురపాలికల్లో హైడ్రా వంటి వ్యవస్థను రూపొందించే పనిలో నిమగ్నమైంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు సమాచారం.

- (ఆంధ్రజ్యోతి), యాదాద్రి

యాదాద్రి జిల్లాలో 17 మండలాలు, ఆరు మునిసిపాలిటీలు, 426 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జిల్లాలోని పలు మునిసిపాలిటీల్లోని చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లతో పాటు అలుగు పారే ప్రాంతాల్లో భవనాలు నిర్మించినట్టు అధికారులు గుర్తించారు. జిల్లాలోనూ హైడ్రా వంటి వ్యవస్థను ఏర్పాటుచేయడంతో పాటు ప్రస్తుతం చెరువుల్లో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతీ మునిసిపాలిటీ పరిధిలో టాస్క్‌ఫోర్స్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం కొత్త వ్యవస్థతో దీన్ని మరింతగా పునరుద్ధరించి, ఆక్రమణలపై ఉక్కు పాదం మోపేందుకు సిద్ధమవుతోంది. మునిసిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, చెరువులు, నీటి వనరుల సర్వే నిర్వహించేందుకు సిద్ధమవుతోంది.

## సాగునీటి వనరుల సర్వే ముమ్మరం

చెరువుల భూములు కబ్జాలు కాకుండా, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా లేఅవుట్‌లు చేయకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. జిల్లాలోని హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల్లో ఫుల్‌ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్‌ల నిర్ధయంపై నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ, బొమ్మలరామారం మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయి. ఈ ఐదు మండలాల్లో హెచ్‌ఎండీఏ పరిధిలో 245 చెరువులు ఉన్నాయి. ఇప్పటివరకు 219 చెరువులకు హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్ జారీచేసింది. ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, స్థానిక సంస్థల అధికారుల సమన్వయంతో చెరువులు, కుంటల సర్వే చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు చెరువులు, కుంటలు,నాలాలను ఆక్రమించి అక్రమంగా లేఅవుట్‌లో వేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్టుగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్ జారీచేసిన 219 చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల సరిహద్దులను నిర్ధయిస్తున్నారు. చెరువులు, కుంటలకు సమీపంలో ఉన్న భూముల రైతులను సంప్రదించి, సంబంధిత అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. రైతుల సమక్షంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిని నిర్ధయిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శిఖం పట్టాలు కూడా ఉన్నాయి. వీటిపైనా అధికారులు దృష్టిసారించారు. లేఅవుట్‌లు, అనుమతులు లేని భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలను ఈ సందర్భంగా పరిశీలిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చేపట్టిన సర్వేలు గూగుల్ మ్యాప్ ద్వారా ఫిక్స్ చేస్తున్నారు. ఫలానా చెరువు విస్తీర్ణం ఎన్ని ఎకరాలు ఉందన్న పూర్తి సమాచారాన్ని గూగుల్‌మ్యాప్‌ల ద్వారా సిద్ధం చేస్తున్నారు.

## చెరువుల వద్ద సీసీ కెమెరాలు

యాదాద్రి జిల్లా హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉండటంతో ఇక్కడి భూములకు భారీ డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో చెరువుల్లో ఆక్రమణలపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. జిల్లాలోని భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, మోత్కురు మునిసిపాలిటీ పరిధిలోని చెరువులు, కుంటలు కబ్జాలు కాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చెరువులు ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. చెరువుల వద్ద చెట్ల పెంపకానికి సైతం సన్నద్ధమవుతున్నారు. భువనగిరి మునిసిపాలిటీ పరిధిలో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో లేఅవుట్‌లు వెలిశాయి. వీటితోపాటు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి సైతం హైడ్రా బాగా పనిచేస్తోందని, ఇదే తరహాలో భువనగిరి నియోజకవర్గంలోని చెరువుల్లో ఆక్రమణలు ఉంటే వాటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలో ఊరచెరువు సర్వేనెంబరు 363లో 33.37ఎకరాల శిఖం భూమి ఉంది. ఈ చెరువులో అలుగు పారే ప్రాంతాల్లో భవనాలు నిర్మించారు. సుమారు 20 నుంచి 30వరకు భవనాలు ఉన్నాయి. వీటిపై జిల్లాయంత్రాంగం సర్వే నిర్వహిస్తోంది. అదేవిధంగా చౌటుప్పల్‌లోని నాగులకుంట చెరువు సర్వే నెంబరు 322లో 11.32ఎకరాల వరకు శిఖం భూమి ఉంది. ఈ శిఖం భూమిలో సుమారు మూడెకరాల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అలుగులు పారే ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై జిల్లాయంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవాలో సమాలోచనలు చేస్తోంది.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు శ్రీకారం

- నేటి నుంచి నవంబరు 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నవంబరు 23న ముసాయిదా జాబితా
- డిసెంబరు 30న తుది జాబితా



నల్లగొండ, సెప్టెంబరు 29: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండటంతో తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితాను రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రక్రియలో భాగంగా ఈ నెల 30వ తేదీ సోమవారం నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు. నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించి, ఆ జాబితాపై అభ్యంతరాలు డిసెంబరు 9 వరకు స్వీకరిస్తారు. అదే నెల 25వ తేదీ వరకు అభ్యంతరాలు పరిశీలించి డిసెంబరు 30వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

### ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఫాం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు తీసుకుంటారు. ఆన్‌లైన్‌లో **ceotelangana.nic.in** వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. గతంలో ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ ఎన్నికల్లో 7,263 మంది ఓటర్లుగా నమోదయ్యారు. అందులో పురుషులు 4,737 మంది, మహిళలు 2,525 మంది ఉన్నారు. ఒక్క నల్లగొండ పట్టణంలో గత ఎన్నికల్లో అత్యధికంగా 1,667 మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. రెండో స్థానంలో సూర్యాపేటలో 880 మంది, మిర్యాలగూడలో 788 మంది, కోదాడలో 468 మంది, భువనగిరిలో 306 మంది, దేవరకొండలో 229 మంది, నకిరేకల్‌లో 217 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఈ సారి జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని మేనేజ్‌మెంట్‌ల ప్రభుత్వ పాఠశాలలు, వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల ఉపాధ్యాయులకు సైతం ఓటు హక్కు కల్పించనున్నారు.

2019లో ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఇలా..

| జిల్లా | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | థర్డ్‌జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| నల్లగొండ | 30 | 2,488 | 1,370 | 1 | 3,859 |
| సూర్యాపేట | 22 | 1,467 | 689 | 0 | 2,156 |
| యాదాద్రి | 16 | 782 | 466 | 0 | 1,248 |
| మొత్తం | 68 | 4,737 | 2,525 | 1 | 7,263 |



బిస్కెట్ బంగారం అంటేనే నాణ్యతకు పేరు. ఐఎస్‌ఐ బ్రాండ్ ఉన్న 24 క్యారెట్ల బిస్కెట్ బంగారంలో 99.9శాతం స్వచ్ఛత ఉంటుంది. బిస్కెట్ బంగారం అంటే ఎవరైనా నమ్మకంగా ఇట్టే కొనుగోలు చేస్తుంటారు. ఇందులో కల్తీ ఉండదనేది వినియోగదారుల నమ్మకం. కొంతమంది కుటుంబ అవసరాలకోసం, ఇంట్లో జరిగే శుభకార్యల కోసం బిస్కెట్ బంగారం కొనుగోలు చేస్తుండగా, మరికొంత మంది పెట్టుబడిగా కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదిగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గుల నేపథ్యంలో కొంతమంది మధ్యవర్తి వ్యాపారులు ఈ బిస్కెట్ బంగారాన్ని సైతం కల్తీ చేస్తున్నట్టు తెలుస్తోంది.

- రామగిరి



# మెరిసేదంతా బంగారం కాదు!

- బిస్కెట్ బంగారం కల్తీతో స్వర్ణకారులు సైతం అయోమయం
- మిర్యాలగూడ కేంద్రంగా దందా
- కోట్లలో వ్యాపారం, ప్రభుత్వ పన్నులు సైతం ఎగవేత
- ఆన్‌లైన్ చెల్లింపులకు ససేమిరా
- పట్టించుకోని విజిలెన్స్, కల్తీ నిరోధకశాఖ అధికారులు

ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి, దేవరకొండ, సూర్యాపేట, చండూర్, మాల్, హాలియ, చౌటుప్పల్ వంటి ప్రధాన ప్రాంతాలకు చెందిన జ్యూయలరీ దుకాణాల యజమానులు బిస్కెట్ బంగారాన్ని హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో కొనుగోలు చేసి తీసుకువస్తుంటారు. అయితే మిర్యాలగూడలో మాత్రం కొంతమంది మధ్యవర్తి వ్యాపారులు హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన బంగారాన్ని మిర్యాలగూడలో కల్తీ చేసి నల్లగొండలోని జ్యూయలరీ షాపులకు, స్వర్ణకారులకు విక్రయిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అయితే మధ్యవర్తి వ్యాపారుల వద్ద కొనుగోలు చేసిన ఈ బిస్కెట్ బంగారం నాణ్యంగానే ఉంటుందని నమ్మకంగా కొనుగోలు చేసిన స్వర్ణకారులు సైతం కల్తీ వెలుగులోకి రావడంతో నివ్వెరపోతున్నారు. ప్రస్తుతం బంగారంలో ధరల హెచ్చుతగ్గుల ప్రభావంతో మిర్యాలగూడ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు కల్తీ బంగారాన్ని విక్రయిస్తున్నట్టు వెలుగులోకి రావడంతో స్వర్ణకారులందరూ కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండా




### జాగ్రత్తగా ఉండాలని వాట్సప్ గ్రూపుల్లో సందేశాలు

లని పలు స్వర్ణకార సంఘాల వాట్సప్ గ్రూపుల్లో ఈ సమాచారం వైరల్ అవుతోంది. నాణ్యత లోపించిన బిస్కెట్ బంగారం విషయం సంఘం దృష్టికి వచ్చినందున, ఈ విషయాన్ని తెలియజేస్తున్నామని, అంతా జాగ్రత్తగా ఉండాలని వాట్సప్ గ్రూపుల్లో పలువురు హెచ్చరిస్తున్నారు.

### వెలుగులోకి వచ్చింది ఇలా..

ఇటీవల నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి, స్థానిక జ్యూయలరీ దుకాణంలో కొనుగోలు చేసిన బిస్కెట్ బంగారాన్ని వస్తువు తయారీ కోసం కరిగించేందుకు బట్టి వద్దకు తీసుకెళ్లాడు. 10 గ్రాములకు 0.500ఎంఎల్‌జీ బంగారం తరుగు వచ్చింది. బిస్కెట్ బంగారం కరిగిస్తే ఏ మాత్రం తరుగుపోకూడదు కదా? ఎందుకు అలా జరిగిందని ప్రశ్నించిన అతడు బట్టీ యజమానితో గొడవపడ్డాడు. ఈ విషయం స్వర్ణకారుల సంఘం దృష్టికి వెళ్లింది. ఆ తర్వాత నుంచి బంగారాన్ని కరిగించే బట్టీ షాపు యజమానులు బిస్కెట్ బంగారాన్ని తెస్తే మీరే కరిగించుకోండంటూ బట్టీనే అప్పగిస్తున్నారు. లేదంటే తాము కరిగించేది లేదని కరాఖండిగా చెబుతున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ స్వర్ణకారుడు వారం రోజుల క్రితం నల్లగొండలో కొనుగోలు చేసిన బిస్కెట్ బంగారంపై అనుమానంతో పరీక్షకు పంపాడు. అయితే ఆ బిస్కెట్ బంగారంలో కల్తీ ఉందని రిపోర్టు వచ్చింది. దీంతో ఆ స్వర్ణకారుడు సంఘం దృష్టికి తీసుకెళ్లాడు. సంఘ నాయకులు అతడికి సర్ది చెప్పడంతో పాటు సదరు వ్యాపారులను కూడా హెచ్చరించడంతో విషయం సద్దుమణిగినట్టు తెలిసింది.



### బిస్కెట్ బంగారం కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి

బంగారం ధరల హెచ్చుతగ్గుల కారణంగా నాణ్యత లోపించే అవకాశం కాస్త ఉండొచ్చు. బిస్కెట్ బంగారంలో కల్తీ 10 ఏళ్ల క్రితం కూడా వెలుగుచూసింది. అప్పట్లో అధికారులు నిర్వహించిన దాడుల కారణంగా సద్దుమణిగింది. అయితే స్థానికంగా ఉండే నమ్మకమైన స్వర్ణకారుడి వద్దే వినియోగదారులు బిస్కెట్ బంగారం కొనుగోలు చేయాలి. అతడి వద్దే నగలకు ఆర్డర్ ఇస్తే మరింత బాగుంటుంది. ఏదైనా లోపం జరిగితే ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుంది. దూరప్రాంతాల వ్యాపారుల వద్ద ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయకపోవడం మంచిది.

- చొల్లేటి హరిప్రసాద్, నల్లగొండ పట్టణ స్వర్ణకార సంఘ అధ్యక్షుడు

### క్యాష్ ఉంటేనే బిస్కెట్ బంగారం

డిజిటల్ పేమెంట్స్ ద్వారా వ్యాపార లావాదేవీలు చేస్తే పారదర్శకంగా ఉండడంతో పాటు ప్రభుత్వ పనులు కూడా ఎగ్గొట్టే అవకాశం ఉండదు. ఈ ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం డిజిటల్ పేమెంట్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. అయితే జిల్లాలో బిస్కెట్ బంగారం వ్యాపారులతో పాటు జ్యూయలరీ దుకాణాల యజమానులు డిజిటల్ పేమెంట్‌లను అంగీకరించడం లేదు. లిక్విడ్ క్యాష్ ఉంటేనే బంగారం విక్రయిస్తామని, ఆన్‌లైన్ పేమెంట్ అయితే విక్రయించేది లేదని కొందరు వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. బంగారం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను ఎగవేసేందుకే ఇలా వ్యాపారులు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### కనిపించని విజిలెన్స్, కల్తీ నిరోధకశాఖ అధికారులు

నమ్మకానికి మారుపేరైనా బిస్కెట్ బంగారం జిల్లాలో జోరుగా కల్తీ జరుగుతున్నా నివారించాల్సిన కల్తీ నిరోధకశాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కల్తీ నిరోధకశాఖ, విజిలెన్స్ అధికారులు బంగారం దుకాణాలపై దాడులు చేయకపోవడం వల్లే కల్తీలు చోటుచేసుకుంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. వారికి కానుకలు అందుతుండటంతో తనిఖీలు చేయడం లేదని, ఆన్‌లైన్ పేమెంట్స్‌ను తిరస్కరిస్తున్న వ్యాపారులపై దృష్టి సారించాల్సిన వాణిజ్యపన్నులశాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

### కనపడని కల్తీతో అయోమయం

బిస్కెట్ బంగారంలో కల్తీతో వృత్తిలో అనుభవం ఉన్న స్వర్ణకారులు సైతం అయోమయానికి గురవుతున్నారు.బంగారంలో కల్తీజరిగితే రాగిలేదా వెండి వంటి లోహాలు కలిసి ఉంటాయి. ఇలాంటి బంగారానికి పరీక్షలు నిర్వహిస్తే కల్తీ జరిగినట్టు రిపోర్టు వస్తుంది. అయితే కొంతమంది మధ్యవర్తి వ్యాపారులు పరీక్షల్లో సైతం దొరక్కుండా అలాయ్ పౌడర్‌వంటి వాటితో కల్తీ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ బంగారాన్ని పరీక్షకుపంపిస్తే రిపోర్టు 99.8శాతం స్వచ్ఛంగా ఉన్నట్టు రిపోర్టు వస్తున్నా, వాటిని నగల తయారీకి కరిగిస్తే కల్తీ వ్యవహారం వెలుగులోకి వస్తోంది. ఇలాంటి చేదు అనుభవాలు జిల్లాలో ఎంతోమందికి స్వర్ణకారులకు ఎదురైనట్లు సమాచారం. అయితే ఈ కనపడని కల్తీ బిస్కెట్ బంగారంతో స్వర్ణకారులు సైతం అయోమయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి బంగారాన్ని కొనుగోలు చేసిన వినియోగదారులు ఎంతమంది నష్టపోయారో తెలియని పరిస్థితి నెలకొంది.

## కిటకిటలాడిన యాదాద్రి



యాదాద్రీశుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో రద్దీగా ఉన్న క్యూలైన్ల కాంప్లెక్స్

•7లో..

## 'బోరు'మంటున్నారు

- సుమారు 30 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులు
- ఉమ్మడి జిల్లాలో 28 మంది
- ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకుంటున్న చేతి పంపుల మెకానిక్‌లు

•7లో..

## ఇథనాల్ పరిశ్రమను నిలిపివేయాలి

- అనుమతుల్లేని నిర్మాణాలను కూల్చివేయాలని రైతుల డిమాండ్

•7లో..

## విద్యారంగాన్ని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానిదే

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 29: విద్యారంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా మహాసభ, విద్యాసదస్సులో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యలో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు ప్రముఖపాత్ర పోషించాలని దానికి ప్రభుత్వం రాజకీయ నిర్ణయమైన తీర్మానాలు చేసి కమిషన్ ఏర్పాటు చేసి వాటి ప్రకారం అమలు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీని ప్రారంభించడం అనుకూలమైనప్పటికీ ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేసిందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు, నాయకులు ధనమూర్తి, జి.నాగమణి, మంగ, జి.రమేష్‌బాబు, సోమయ్య, అనిల్‌కుమార్, యాకయ్య, శ్రీనివా‌స్‌రెడ్డి, అరుణభారతి, కమల, వెంకటయ్య, దామోదర్, రవీందర్, పాపిరెడ్డి, నాగేశ్వర్‌రావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎస్ఏ.సత్తార్ ఇటీవల మృతిచెందగా, సంతాప సభలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు లింగయ్యయాదవ్ పాల్గొన్నారు.

### అధైర్యపడవద్దు.. అండగా ఉంటాం

సూర్యాపేట(కలెక్టరేట్): పట్టణ ప్రజలు హైడ్రా పేరుతో భయాందోళనలకు గురికావొద్దని, తాను అండగా నిలబడతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజల పక్షాన పోరాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని, గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ పేటను అభివృద్ధి చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రజలను కన్నీరు పెట్టించడం సమాజానికి మంచిదికాదన్నారు. బాధితులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారి కుటుంబాలకు తామంతా భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు లింగయ్య యాదవ్, మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్టకిశోర్, నాయకులు నిమ్మల శ్రీనివా‌స్‌గౌడ్, అంగిరేకుల నాగార్జున, నాయకులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం

**జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**

**కోదాడటౌన్, సెప్టెంబరు 29:** సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని ఏపీ రాష్ట్రం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. కోదాడ ఆవోపా 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులు సమాజహితం కోసం సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. కోదాడలో రెండు దశాబ్దాలుగా ఆవోపా చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మహిళలు పురుషులతో సమానంగా రాణించాలన్నారు. అనంతరం ఆవోపా అధ్యక్షుడు ఇమ్మడి రమేష్ మాట్లాడుతూ, ఈ ఏడాది 48 మంది విద్యార్థులకు విద్యానిధి నుంచి సహకారం అందించడమేగాక పలు కోర్సుల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. పదిమంది వృద్ధులకు పెన్షన్లు అందజేశామన్నారు. అనంతరం 2024-26 సంవత్సరానికి ఎన్నికైన నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వందనపు శిల్ప, నాయకులు చెన్నకేశవరావు, కందిబండ వెంకటేశ్వరరావు, వంగవీటి లోకేష్, బొగ్గరపు రామ్మూర్తి, చారుగుండ్ల రాజశేఖర్, ఓరుగంటి శ్రీనివాసరావు, స్వామి, శ్రీనివాసరావు, గరినే కోటేశ్వరరావు, ఓరుగంటి ప్రభాకర్, గరినే శ్రీధర్, పెనుగొండ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

## వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు, నార్కట్‌పల్లి, నిడమనూరు మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరొకరు దుర్మరణం చెందారు.

•7లో..

# మురుగునీరు వస్తోందని..

**● ఇరు కుటుంబాల ఘర్షణ ● పలువురికి గాయాలు**

మఠంపల్లి, సెప్టెంబరు 29: రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన తాటికొండ పాపిరెడ్డి, తొడేటి వెంకయ్యయాదవ్ మధ్య ఇంటి ప్రహరీకి సంబంధించి పంచాయితీ నడుస్తోంది. ప్రహరీ దాటి తమ ఇంట్లోకి మురుగు, వరద నీరు వస్తోందని వెంకయ్యయాదవ్ కుటుంబసభ్యులపై పాపిరెడ్డి కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ దాడిలో వెంకయ్యయాదవ్, ఆయన భార్య వెంకటనర్సమ్మ, కోడలు గంగతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం వారిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అదేరోజు రాత్రి వెంకయ్యయాదవ్ బంధువులు కొంతమంది పాపిరెడ్డి కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఈ దాడులలో పాపిరెడ్డి కుటుంబ సభ్యులు వెంకటరెడ్డి, జానకమ్మతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇరు కుటుంబాల ఫిర్యాదులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు ఆదివారం తెలిపారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం : బత్తుల



పోటీలను ప్రారంభిస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 29:** క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సుమన్ చోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలోని రైస్‌మిల్లర్స్ భవనంలో నిర్వహిస్తున్న పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు కంరాటే, కుంగ్‌ఫూలలో ఉచిత శిక్షణ ఇవ్వడం ఆదర్శనీయమన్నారు. డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో క్రీడోత్సాహం నింపడం అభినందనీయమన్నారు. పట్టణంలో నేషనల్స్ నిర్వహించడంతో నియోజకవర్గకేంద్రం దేశవ్యాప్త గుర్తింపు పొందుతుందన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కుంగ్‌ఫూ సాధనచేశారు. ఆర్గనైజింగ్ ఫౌండర్ బూడిద సైదులు, కరాటే మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్ మాట్లాడుతూ పోటీలకు 800 మంది క్రీడాకారులు తరలివచ్చారన్నారు. కార్యక్రమంలో మిల్లర్స్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఎంఈవోలు బాలునాయక్, బాలాజీనాయక్, ప్రముఖ వ్యాపారి గుడిపాటి నవీన్, అర్జున్, శ్రీనివాసాచారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కృష్ణకాంత్‌ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సన్మానించారు.

### ఫుట్‌బాల్ పోటీలకు తేజు ఎంపిక



**హాలియా, సెప్టెంబరు 29:** ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో అక్టోబర్ 1, 2 తేదీల్లో జరగబోయే అండర్-17 విభాగం ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్ గ్రేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ పోటీలకు హాలియా మునిసిపాలిటీకి చెందిన చింతలచెర్వు తేజు ఎంపికయ్యాడు. తేజు ప్రస్తుతం చండూరు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అర్జున్, కోచ్ లింగ్యానాయక్ తెలిపారు. తేజు ఎంపిక పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

### జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

**నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 29:** నల్లగొండ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 2వ తేదీన పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు విద్యుత్ పోల్ మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.బయ్యన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఆసక్తి గల క్రీడాకారుల వయస్సు, ఆధార్‌కార్డు ప్రతులను తీసుకొని పోటీలకు హాజరుకావాలని కోరారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు అక్టోబరు 4వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల 69వ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తారని

## ఇథనాల్ పరిశ్రమను నిలిపివేయాలి

● అనుమతుల్లేని నిర్మాణాలను కూల్చివేయాలని రైతుల డిమాండ్



ఆందోళన నిర్వహిస్తున్న రావిపహాడ్, సర్వారం గ్రామస్థులు

**మోతె, సెప్టెంబరు 29:** ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంతో గ్రామాలు ప్రమాదంలో పడుతాయని, పరిశ్రమ పనులను నిలిపివేయాలని, లేదంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని రావిపహాడ్, సర్వారం గ్రామస్థులు డిమాండ్ చేశారు. రావిపహాడ్‌లో ఎంఎన్‌కే బయోఫ్యూయల్స్ పేరుతో నిర్మాణాలు చేపడుతున్న పరిశ్రమ వద్ద ఆదివారం రావిపహాడ్, సర్వారం గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో అధికారులపై ఒత్తిడిచేసి అనుమతులు ఇప్పించారన్నారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం పూర్తయితే ప్రజలకు రోగాలు, పంటలకు కాలుష్యం తప్పవన్నారు. రైతులు, గ్రామస్థులు పరిశ్రమ గేటు వద్ద గంటసేపు ధర్నాకు దిగారు. గత సర్పంచ్, కార్యదర్శితోపాటు మరికొందరు నాయకులు గ్రామంలో గ్రామసభ నిర్వహించకుండా ప్రజల అభిప్రాయం తెలియకుండానే అనుమతులు ఇచ్చారని గ్రామస్థులు ఆరోపించారు. పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టడంతోనే గ్రామానికి నష్టం జరుగుతున్నా గత పాలకులు మాట్లాడడం లేదని వాపోయారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, ధర్నాలు చేపట్టినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పరిశ్రమ నిర్మాణం నిలిపివేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు కోట సుధాకర్‌రెడ్డి, శ్రీను, జాన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, కరుణాకర్‌రెడ్డి, ఉపేందర్, నగేష్, కాశయ్య, భిక్షం, సుధాకర్ పాల్గొన్నారు.

## కూలిన స్లాబ్ : తప్పిన ప్రమాదం

**హుజూర్‌నగర్, సెప్టెంబరు 29:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని కమ్మబజార్‌లోని రాగిచెట్టు వద్ద 50 ఏళ్ల నాటి పాత మిద్దె స్లాబ్ కూలింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పొనుగుపాటి వెంకటేశ్వరరావు నివాసంలో మధ్యగదిలో ఒక్కసారిగా స్లాబ్ మొత్తం కుప్పకూలింది. కాగా వెంకటేశ్వరరావు నివాసంలో పిల్లుట్ల నరేష్ కుటుంబం అద్దెకు ఉంటుంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో నరేష్ కుటుంబ సభ్యులు గదిలో భోజనం చేసి వరండాలో కూర్చున్నారు. ఈ సమయంలో అకస్మాత్తుగా మిద్దె స్లాబ్ కూలడంతో నరేష్ భార్య, కుమార్తె, ముగ్గురు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వరండాలో ఆ ముగ్గురు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా సంఘటన స్థలాన్ని 15వ వార్డు కౌన్సిలర్ కోటా లక్ష్మీనర్సింహారావుచౌదరి, 16వ వార్డు కౌన్సిలర్ కారింగుల వెంకటేశ్వర్లు, విజయ పరిశీలించారు.

# బోరుమంటున్నారు





ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల కింద పనిచేస్తున్నా గ్యారెంటీ లేని ఉద్యోగం, జీతంతో బోరుమంటూ విలపిస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మంత్రుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ కొలువు పర్మినెంట్ చేయమని కాళ్లా వేళ్లా పడి బతిమాలుతున్నారు కాంట్రాక్టు బోరు మెకానిక్‌లు. బోర్లు మరమ్మతులు చేస్తున్నాం కానీ బోరు జీవితాలను బాగు చేసుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

-(మిర్యాలగూడ)

- సుమారు 30 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగాలే
- ఉమ్మడి జిల్లాలో 28 మంది
- ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వేడుకుంటున్న చేతి పంపుల మెకానిక్‌లు

గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో గ్రామాల్లో చేతిపంపుల మరమ్మతులకు జిల్లాలో రెగ్యులర్ మెకానిక్‌లులేని చోట గ్రామపంచాయతీల అవసరాల మేరకు 1992 నుంచి బోర్ మెకానిక్‌ల నియామకం చేపట్టారు.నాటి నుంచి కాంట్రాక్టు మెకానిక్‌లుగానే పనిచేస్తూ వస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ఇంత వరకు పోస్ట్ రెగ్యులర్ చేయలేదని, రిటైర్‌మెంట్ దశకు చేరుతున్నా ప్రభుత్వాలు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి పంచాయతీరాజ్ శాఖకు...**

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో కాంట్రాక్టు మెకానిక్‌లుగా నియమితులమైనా మస్టర్ పద్ధతిలో నెలకు రూ.4500 చొప్పున జీతాలు చెల్లించేవారు. ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్‌లు వేరు పడ్డాయి. ఆ సమయంలో గ్రామ పంచాయతీలకు నీటి సరఫరా అవసరం కావున ఆర్‌డబ్ల్యూఎస్ నోడల్ వ్యవస్థ నుంచి 2004లో పంచాయతీరాజ్‌కు మెకానిక్‌లను అటాచ్ చేశారు. అప్పటి నుంచి ఎంపీడీవోల జనరల్ ఫండ్ నుంచి మెకానిక్‌లకు జీతాలు చెల్లించారు. 2008లో జనరల్ ఫండ్ రద్దు కావడంతో 13వ ఫైనాన్స్ ద్వారా కేంద్రం నేరుగా గ్రామపంచాయితీలకు నిధులు మంజూరు చేయడంతో పంచాయితీ గ్రాంట్ల నుంచి 10 శాతం కోత విధించి మెకానిక్‌ల జీతాలకు, పంచాయతీ ఆపరేటర్లకు, కార్యాలయ ఖర్చులకు వినియోగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎంబీ రికార్డు ద్వారా ఎంపీడీవోతో సుముఖంగా ఉన్న చోట రెగ్యులర్‌గాను లేదంటే రెండు మూడు నెలలకు ఒకసారి జీతాలు అందేవని మెకానిక్‌లు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ. 16 వేల నుంచి రూ. 19వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 4200 చేతి పంపులు**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 4200 చేతి పంపులు ఉండగా 28మంది కాంట్రాక్టు మెకానిక్‌లు ఉన్నారు. 2019 నాటికి రాష్ట్రంలో లక్షా డెబ్బై వేల చేతిపంపులు ఉన్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న బోరు మెకానిక్‌లు రాష్ట్రవ్యాప్తంగా 337 మంది ఉన్నారని వారిని రెగ్యులర్ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పి మెకానిక్‌లను పట్టించుకోలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.

**మిషన్ భగీరథతో మూలకు పడిన చేతిపంపులు**

బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లానీరు అందిస్తామని అప్పటికే గ్రామాల్లో కొనసాగుతున్న చేతిపంపుల నిర్వహణను వదిలివేసింది. దీంతో కాంట్రాక్టు బోరు మెకానిక్‌లను మిషన్ భగీరథ పైపులైను అమర్చడం లోనూ, ఇళ్లకు నల్లాలు బిగించడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములను చేసింది. కాగా వేతనాలు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు ఆరోపిస్తున్నారు.

**నల్ జల్ సేవక్**

ఇటీవల కేంద్రప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో నల్ జల్ సేవక్‌ల ద్వారా నీటి సరఫరా, విద్యుత్ మోటార్ల స్టార్టర్ల నిర్వహణ, డ్యామేజీ పైపులైన్ల మరమ్మతులు, వాటర్ టెస్టింగ్ ద్వారా నీరు తాగడానికి పనికి వస్తుందా లేదా అనేది నిర్ధారించడం లాంటి విధులను నిర్వహించేందుకు నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో హ్యాండ్ పంపుల నిర్వహణకు ఏడాదికి ఒక్కో పంపునకు రూ. 6వేలు, బోరు మోటార్ల నిర్వహణకు మరికొంత, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణకు మరికొన్ని నిధులు కేంద్రం నుంచి మంజూరు చేయించి నల్‌జల్‌సేవక్‌ల నియామకం పేరుతో కాంట్రాక్టు మెకానిక్‌లను తప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ పనులన్నీ గతం నుంచే నిర్వహిస్తు వస్తున్న మెకానిక్‌లకు మరికొంత శిక్షణ ఇచ్చి నల్ జల్ సేవక్‌లుగా వినియోగించుకుని రెగ్యులరైజ్ చేయాలన్న డిమాండ్‌ను ముందుకు తెస్తున్నారు.

**రెగ్యులర్ చేస్తామని చేయలేదు**



గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి మెకానిక్‌లకు మొండిచేయి చూపింది. మిగతా శాఖల కింద పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసింది. ఆ విధంగానే 30 ఏళ్లకు పైగా సేవలు అందిస్తున్న తమను కాంగ్రెస్ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి తమ కుటుంబాలకు భరోసా ఇవ్వాలి.

- దొబ్బల శంకర్, రాష్ట్ర నాయకుడు, చేతి పంపుల మెకానిక్ యూనియన్

**మంత్రుల దృష్టికి తీసుకెళ్లాం**



బీఆర్ఎస్ హయాంలో పంచాయతీరాజ్ శాఖామంత్రి ఎర్రబెల్లి దయకర్ రావును కలిసి పర్మినెంట్ చేయాలని కోరాం. సీఎం దృష్టికి తీసుకెళ్లి రెగ్యులర్ అయ్యేటట్లు చూస్తామని హామీ ఇచ్చా రు. ఆ తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుత మంత్రి సీతక్కను కలిసి గోడు వెళ్లబోసుకోగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ చేతి పంపులతోనే గిరిజనులకు తాగునీరు అందుతుందని రెండు మూడు నెలల్లో సీఎం తో చర్చించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఇంతవరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. ముసిలితనం వరకు మమ్మల్ని వాడుకుని ప్రభుత్వం నిర్దాక్షిణ్యం గా వదిలి వేసేందుకు సిద్ధమైంది. మా ఆవేదనను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి ఆదుకోవాలి.

- పల్లపు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చేతిపంపుల మెకానిక్ యూనియన్

# భక్తజన సంద్రం.. యాదగిరిక్షేత్రం

● ధర్మదర్శనానికి గంట, ప్రత్యేక దర్శనాలకు అరగంట సమయం ● స్వామివారిని దర్శించుకున్న 20వేల మంది భక్తులు ● వచ్చే నెల 3వ తేదీ నుంచి శివాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



క్యూలైన్లలో భక్తుల రద్దీ

**భువనగిరి అర్బన్, సెప్టెంబరు 29:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకునేందుకు యాదగిరికొండకు తరలివచ్చిన భక్తులతో ఆదివారం కొండపై సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 20వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనుల సందడి కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు అర గంట, ధర్మదర్శనాలకు గంట సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలలు కూడా సందడిగా మారాయి. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,91,215 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. పాతగుట్ట స్వామిఅమ్మవార్లకు నిత్య పూజలు వైభవంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో కొనసాగాయి. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.



ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

**శివాలయంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు**

యాదగిరిగుట్ట ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 12 వరకు తొమ్మిది రోజులపాటు జరిగే పూజ కార్యక్రమాల్లో పాల్గొనే దంపతులు రూ.1,116, ఒక్క రోజు సప్తశతి పారాయణం రూ.116, లక్ష కుంకుమార్చన రూ.116 కౌంటర్‌లో టికెట్ పొంది భక్తులు పాల్గొనాలని కోరారు. నవరాత్రోత్సవాల సందర్భంగా శివాలయంలో భక్తులతో జరిపించే రుద్రహోమం రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

**త్వరలో వాహన పూజల షెడ్డు**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వద్ద వాహన పూజలు నిర్వహించేందుకు సరైన ప్రదేశం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భక్తులకు ఉపశమనం కలిగించేందుకు క్షేత్రం ఉత్తర దిశలో కొండకింద పార్కింగ్ అభిముఖంగా ప్రత్యేకంగా నూతన షెడ్డును ఏర్పాటుచేశారు. వచ్చే నెల 5న గిరి ప్రదక్షిణ రోజున షెడ్డును ప్రారంభించనున్నట్లు సమాచారం. కాగా, 32/32 విస్తీర్ణంలో రూ.ఐదు లక్షలతో నిర్మించగా షెడ్డు పక్కనే నీళ్లతో నిండిన బావి ఉండగా, అక్కడే వాహనాలకు కొద్ది దూరంలో వాషింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. కాగా, భారీ వాహనాలకు (లారీ, బస్సు) రూ.1,000, నాలుగు చక్రాల వాహనాలు రూ.600, ఆటో రూ.400, ద్విచక్ర వాహనం రూ.300గా, ఇంతకు ముందే టికెట్ల ధరలు నిర్ణయించారు. ప్రస్తుతం కొండకింద సత్యదేవుని వ్రతమండపం పక్కన కంటైనర్‌లో వాహన పూజలు జరుగుతుండగా అక్కడకు పూజల కోసం వాహనాలు వెళ్లేందుకు రద్దీ రోజుల్లో మూడో ఘాట్ రోడ్డు వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ఇబ్బందికరంగా ఉంటుంది. ఇందుకోసం ఆలయ ఉద్ఘాటన కోసం ఏర్పాటు చేసిన షెడ్డును వాహనాల పూజల కోసం వినియోగంలోకి తేచ్చేందుకు అధికారులు చొరవ తీసుకున్నారు.

# మల్లయ్య సేవలు అజరామరం

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ● నిస్వార్థంగా పని చేసినప్పుడే గుర్తింపు : ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలూనాయక్ ● బూరుగు పెద్ద మల్లయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

**చింతపల్లి, సెప్టెంబరు 29:** మల్లయ్య సేవలు అజరామరమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం చింతపల్లి మండలంలోని నెల్వలపల్లి మాజీ సర్పంచ్ బూరుగు పెద్ద మల్లయ్య విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక, రాజకీయ రంగాల్లో అనుభవం కలిగిన మల్లయ్య సేవలు అభినందనీయమన్నారు. నమ్మిన సిద్ధాంతంకోసం ప్రజలతో మమేకమై పనిచేస్తూ వ్యాపారవేత్తగా అంచలంచెలుగా ఎదిగారన్నారు. ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ మల్లయ్య పదవులను ఆశించకుండా ప్రజలే కుటుంబ సభ్యులుగా భావించి ఆపదలో ఆదుకునే వారని గుర్తు చేశారు. ప్రజలకోసం లాభాపేక్ష లేకుండా పని చేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. పెద్ద మల్లయ్య చిన్న నాటి నుంచే గ్రామంలో ఉంటూ ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి నిస్వార్థంగా పనిచేశారన్నారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా కాలంలో ప్రణవ్ గ్రూప్ చైర్మన్ బూరుగు రవికుమార్ ప్రజలకు నిత్యావసర సరకులు అందించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ప్రణవ్ గ్రూప్ చైర్మన్ బూరుగు రవికుమార్, రాంబాబు, పెద్దమల్లయ్య కుమార్తె శోభారాణి, అల్లుడు ప్రభాకర్, సోదరులు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, బీజేపీ సీనియర్ నేతలు గంగిడి మనోహర్‌రెడ్డి, డాక్టర్ నమ్మిడి ప్రకాష్ రెడ్డి, జె.సంగప్ప, లంకల దీపక్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, గున్‌రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





బూరుగు పెద్ద మల్లయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్, నాయకులు, కుటుంబ సభ్యులు

# వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు, నార్కట్‌పల్లి, నిడమనూరు మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో చికిత్స పొందుతూ మరొకరు దుర్మరణం చెందారు.**



భీముడు, వెంకటేష్ (ఫైల్)

**కొండమల్లేపల్లి, సెప్టెంబరు 29:** ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. కొండమల్లేపల్లి మండలం చెన్నారం గేటువద్ద ఆదివారం ఈ ఘటన జరిగింది. కొండమల్లేపల్లి ఎస్ఐ రాంమూర్తి, స్థానికుల వివరాల ప్రకారం.. నేరేడుగొమ్ము మండలం బుగ్గతండాకు చెందిన లోటావత్ భీముడు(23), అతని సోదరుడి కుమారుడైన వెంకటేష్(8) కలిసి ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై నాంపల్లి మండలం రేక్యతండాలోగల బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి కొండమల్లేపల్లి మండలం చెన్నారం గేటు మలుపు వద్ద హైదరాబాద్‌నుంచి ఐదుగురు విద్యార్థులు కారులో చీరాలకు వెళుతూ, కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన భీముడు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గంమధ్యలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకొని కారులో ప్రయాణిస్తున్న ఐదుగురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

**కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు..**

**నార్కట్‌పల్లి, సెప్టెంబరు 29:** కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మానిలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన చొప్పరి వెంకటయ్య(55) నార్కట్‌పల్లిలో ఉంటూ సైకిల్ పై తిరుగుతూ సమోసాలు అమ్ముకుంటూ జీవనం గడుపుతున్నాడు. రోజు మాదిరిగానే మండలంలోని నెమ్మానికి సైకిల్‌పై వెళ్లి సమోసాలు విక్రయించి తిరిగి వస్తుండగా నార్కట్‌పల్లి వైపునకు వస్తుండగా ఎదురుగా అమ్మనబోలు వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై వెంకటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటయ్య భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**ఆటోను ఢీకొన్న కారు**



**నిడమనూరు:** ప్రమాదవశాత్తు ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం కోటమైసమ్మ గుడి సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం కొంతమంది ప్రయాణికులతో ఆటో మిర్యాలగూడ నుంచి ఆదివారం సాయంత్రం నారమ్మగూడెం వైపు వెళ్తుండగా ముకుందాపురం దాటుతుండగా కోటమైసమ్మ గుడి సమీపంలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఓ కారు ప్రమాదవశాత్తు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నారమ్మగూడెం గ్రామానికి చెందిన గడ్డం సుబ్బమ్మ(55) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆమెతోపాటు ఆటో డ్రైవర్, మరో ప్రయాణికురాలికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగ్రాత్రులను వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సుబ్బమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని నిడమనూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**మద్యానికి బానిసై..**

**దేవరకొండ, సెప్టెంబరు 29:** దేవరకొండకు చెందిన కంచర్ల తిరుపతయ్య(47) ఇటీవల మద్యానికి బానిసై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. పట్టణానికి చెందిన కంచర్ల తిరుపతయ్య టిఫిన్ సెంటర్‌లలో పనిచేస్తూ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. అతనికి భార్య ఉండగా, సంతానం లేదు. ఇటీవల తిరుపతయ్య మద్యానికి బానిసకావడంతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికి గురై శనివారం రాత్రి దేవరకొండ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, తిరుపతయ్య తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

**చికిత్స పొందుతూ..**




శ్రీనునాయక్(ఫైల్)

**మద్దిరాల, సెప్టెంబరు 29:** భూ వివాదంలో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేసుకొని చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుక్కడం గ్రామపంచాయతీ ఆవాస ప్రాంతమైన రాజాగాని తండాకు చెందిన లకావత్ లచ్చునాయక్-జుమ్మి దంపతుల పెద్ద కుమారుడు లకావత్ శ్రీనునాయక్(26) అదే తండాకు చెందిన పెద్దనాన్న కుమారుడు రవినాయక్, బాబాయి రెడ్యానాయక్, బాబాయి కుమారుడు సురేష్‌నాయక్‌ల మధ్య పదేళ్ల నుంచి భూతగాదా కొనసాగుతోంది. భూమిలో బాగాల్లో భాగంగా బాట తీశారు. ఆ బాట తీసిన భూమిని బాబాయి రెడ్యానాయక్, వరుసకు సోదరులైన సురేష్‌నాయక్, రవినాయక్ ఆ బాటను దున్నడంతో పెద్ద మనుషుల సమక్షంలో బాటను తీయగా, వారు మళ్లీ బాటను దున్నారు. నాలుగు రోజుల క్రితం శ్రీనునాయక్‌ను బాటపై నుంచి వెళ్లకుండా ఘర్షణకు దిగారు. మనస్తాపానికి గురైన శ్రీనునాయక్ శనివారం రాత్రి తండా శివారులో పురుగుల మందు తాగగా, స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. శ్రీనునాయక్‌కు భార్యతోపాటు రెండేళ్ల కుమార్తె, ఏడాది కుమారుడు ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో మద్దిరాల ఎస్ఐ వీరన్న, నాగారం ఎస్ఐ అవిలయ్య సహా బందోబస్తు నిర్వహిస్తున్నారు. శ్రీనునాయక్ భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనునాయక్ తెలిపారు.

## సాగర్ నీటిమట్టం 588.90 అడుగులు

**నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 29:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 588.90 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 588.90 అడుగులు (308.7614 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి మొత్తం 43,024 నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 36,163 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతుంది. ఈక్రమంలో ఎగువ ప్రాంతాల నుంచి 2,402.64 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా రెండు క్రస్టుగేట్ల ద్వారా 1423.02 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ద్వారా ఆయకట్టుకు 530.64 క్యూసెక్కులు మొత్తం 1953.66 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు(4.46టీఎంసీ)కాగా, ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 644 అడుగులు(4.15టీఎంసీ)లుగా ఉంది. కాగా రెండో విడతగా కుడికాల్వకు 313.56 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 217.08 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదే విధంగా ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల అధికారులు ప్రాజెక్టు ఒక రేడియల్ క్రస్టు గేట్‌ను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, ఆదివారం సాయంత్రం 174.89 అడుగులు(45.61 టీఎంసీలుగా) నమోదైంది.

# ప్రభుత్వ భూములు హాంఫట్




## ధరణి పేరుతో భూదందా

**హుజూర్‌నగర్, సెప్టెంబరు 29:** కంచే చేను మేసిన చందంగా భూములకు రక్షణగా ఉండాల్సిన రెవెన్యూ అధికారులే ధరణి పేరుతో భూ దందాచేశారు. డిజిటల్ సంతకాలు చేసి ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వంలోని నాయకులకు, వారి అనుచరులకు అప్పనంగా అప్పగించారు. గతంలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఈ అక్రమాలకు సహకరించారనే ఆరోపణల ఎఉన్నాయి. మండలంలోని లింగగిరి రెవెన్యూ పరిధిలోని శ్రీనివాసపురం గ్రామ శివారు ఏనెగట్టులో సర్వే నెం.715, 718, 720లో ఉన్న సుమారు 25ఎకరాల భూమిని అప్పటి అధికార పార్టీకి చెందిన నాయకులు, ఆంధ్రాకు చెందిన కొంతమంది వ్యక్తుల పేరిట డిజిటల్ పట్టాలు మార్చారు. ఈ లావాదేవీల్లో లక్షల రూపాయల చేతులు మారాయి. ● హుజూర్‌నగర్‌లోని సర్వే నెం. 1041, 608, 154, 273 పాటు మరో కొన్ని నెంబర్లలో సుమారు 300ఎకరాలకు పైగా ప్రభుత్వ మిగులు భూ ములను అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులతో పాటు పేరు మోసిన ప్రముఖులకు, ఇతరులకు నిబంధనలకు విరుద్ధంగా ధరణి పోర్టల్‌లో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని గోవిందాపురం, ముక్త్యాల మేజర్ కాలువ సమీపంలో రామస్వామి గుట్టకు వెళ్లే దారిలో, లక్కవరం రోడ్డు, అనుములగూ డెం సమీపంలోని కొన్ని పొలాలు, వేపలసింగారం రోడ్డు, మట్టపల్లి, లింగగిరి రోడ్డు, గోవిందాపురం ప్రాంతాల్లోని ప్రభుత్వ మిగులు భూములను రికార్డుల్లోకి ఎక్కించినట్లు సమాచారం. 2014, 2016, 2019 వరకు పనిచేసిన రెవెన్యూ అధికారులతో పాటు 2019 నుంచి 2023 ఆగస్టు వరకు పనిచేసిన అధికారులు, రికార్డుల్లో అక్రమంగా నమోదు చేసినట్లు విమర్శలు ఉన్నాయి.

ఇదిలా ఉండగా మండలంలోని బూరుగడ్డలోనే కాకుండా హుజూర్‌నగర్ పట్టణం, లింగగిరి, అమరవరం, వేపలసింగారం, శ్రీనివాసపురం గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారుల అండతో ప్రభుత్వ మిగులు భూములను పక్కనే ఉన్న భూస్వాముల పేరిట ధరణి పోర్టల్‌లో ఎక్కించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా 2019 నుంచి గత ఏడాది వరకు ధరణిలో ఎక్కించగా, అంతకుముందు ప్రభుత్వ భూములు మ్యాన్యువల్‌గా నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో ధరణికి ముందు, తర్వాత రికార్డును తనిఖీ చేస్తే పూర్తి వివరాలు బయటపడతామని రైతులు చెబుతున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ముగ్గురు రెవెన్యూ అధికారులు కోట్ల విలువైన మునిసిపాలిటీ స్థలాలను కొందరికి అక్రమంగా పట్టాలు జారీ చేశారు. దీంతో తమ స్థలాలకు హద్దులు కేటాయించాలని కోరుతూ అక్రమంగా భూములు పొందిన వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం భూమి ఆధీనంలో ఉన్న రైతులలకు, డిజిటల్ పట్టాలు పొందిన వ్యక్తుల మధ్య ఘర్షణలు జరుగగా, కేసులు నమోదై పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.

గతంలో బూరుగడ్డలో 36 ఎకరాల 23 కుంటలకు భూమిని అక్రమంగా ఇతరుల పేరిట ఎక్కించారు. ప్రస్తుతం మరో భూదందా బయటికి రావడంతో హుజూర్‌నగర్ మునిసిపాలిటీ మండలంలోని తొమ్మిది గ్రామపంచాయతీలలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశిస్తే పూర్తి విషయాలు బయట పడతాయని రైతులు అంటున్నారు. కోట్లు విలువచేసే భూమి ఉన్నతాధికారుల సహకారం లేకుండా డిజిటల్ సంతకాలు ఎలా చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### సమగ్ర విచారణకు ఆదేశించాం



బూరుగడ్డలో జరిగిన భూ అక్రమాలతో పాటు హుజూర్‌నగర్ మునిసిపాలిటీలోని ప్రభుత్వ భూములు, మండలంలోని అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూములకు సంబంధించి ధరణిలో జరిగిన అక్రమాలపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు. ధరణికి ముందు ఎన్ని భూములు ఉన్నాయి? తర్వాత ఎన్ని భూములు ఉన్నాయి? ధరణిలో ఎన్ని భూములకు పట్టాలు మార్పిడి చేశారన్న విషయమై విచారణ జరుగుతోంది. బూరుగడ్డలోని 36.23ఎకరాలకు సంబంధించి అదనపు కలెక్టర్ విచారణ చేస్తున్నారు.

● శ్రీనివాసులు, ఆర్డీవో, హుజూర్‌నగర్

## విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి

**కోదాడ టౌన్, సెప్టెంబరు 29:** విద్యార్థులు సామాజిక సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని పీడీఎస్‌యూ నాయకుడు ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. పీడీ ఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కోదాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులకు నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఎం.పాండురంగారావు, పి.నాగిరెడ్డి, పి.సీతయ్యతో కలిసి వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినీవిద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మట్టారెడ్డి, రాఘవరెడ్డి, స్వామి, రామనరసయ్య, ఎన్.హరికిషన్‌రావు, కోటయ్య, మస్తాన్, వీరభద్రం, మల్లయ్య, ఉదయగిరి, వి.నరసింహారావు, చందర్‌రావు పాల్గొన్నారు.

## 'ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తాం'

**సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 29:** ప్రజాసమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఏడు కౌన్సిలర్ స్థానాలను గెలుచుకున్న సీపీఎంకు పూర్వ వైభవం తెచ్చేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. అనంతరం సీపీఎం వాణిజ్య భవన్ సెంటరు శాఖ కార్యదర్శిగా బొమ్మిడి లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి, మట్టిపల్లి సైదులు, చిత్రం భద్రమ్మ, బోళ్ల సోమిరెడ్డి, గోగుల సురేష్, ఉపేందర్, మమత, జ్యోతి, ధనలక్ష్మి, సైదులు, వీరయ్య పాల్గొన్నారు.

## 'కూల్చివేతలు తాత్కాలికంగా ఆపివేయాలి'

**నేరేడుచర్ల, సెప్టెంబరు 29:** 'హైడ్రా' పేరుతో పేరిట హైదరాబాద్‌లో పేదల ఇళ్ల కూల్చివేతలకు రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా విరామం ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. ఆదివారం నేరేడుచర్లలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలు శాఖల అనుమతులతో ఎన్నో ఏళ్ల కిందట నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం సముచితం కాదన్నారు. ఇళ్ల నిర్మాణానికి అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల కూల్చివేత నిర్ణయాన్ని ఆపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఊదర వెంకన్న, కొమ్రాజు వెంకట్‌లు పాల్గొన్నారు.

## మట్టపల్లిలో క్షేత్రంలో వైభవంగా గరుడోత్సవం

**మఠంపల్లి, సెప్టెంబరు 29:** మండలంలోని ప్రసిద్ధ మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గరుడోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణను నిలిపివేయాలి

**మఠంపల్లి, సెప్టెంబరు 29:** మండలంలోని నాగార్జున సిమెంట్స్ సంస్థ రైల్వే లైన్ నిర్మాణానికి మఠంపల్లి నుంచి నిర్వహిస్తున్న భూ సేకరణ పనులను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యపాండునాయక్, భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు ఇస్లావత్ బాలాజీనాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రైల్వే లైన్‌లో భూములు కోల్పోతున్న రామచంద్రాపురంతండా, బోజ్యాతండా, భీమ్లాతండాలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుంటే సహించబోమని హెచ్చరించారు. ఈ రైల్వే ట్రాక్ వివాదంలో ఉన్న సర్వే నెం.540 నుంచి వెళుతోందని, ఎన్‌సీఎల్ పరిశ్రమ యాజమాన్యం ఏ విధంగా సర్వే చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఇదే సర్వే నంబరులో కొంతమంది కబ్జాలో ఉండగా, మరికొందరు పట్టా కలిగి ఉన్నారని తెలిపారు. వివాదంలో ఉన్న ఈ భూములకు నష్టపరిహారాన్ని నిర్ణయించకుండా, పరిశ్రమ యాజమాన్యం చేస్తున్న భూసేకరణపై తహసీల్దార్, ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి బాధిత గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరామని అన్నారు. ఈ సమావేశంలో మూడు తండాల బాధిత రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం



గోరెంట్ల జడ్పీ హైస్కూల్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**మద్దిరాల, సెప్టెంబరు 29:** మండలంలోని గోరెంట్ల గ్రామ జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1995-96 పదో తరగతి బ్యాచ్‌విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నాని అన్నారు. అనంతరం ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు రంగారెడ్డి, లక్ష్మణాచారి, వర్దెల్లి మల్లయ్య, కృష్ణారెడ్డి, లలిత, పోతులూరు, సోమరాజు, పూర్వ విద్యార్థులు బత్తుల లింగయ్య, శ్రీను, పల్ల సతీష్, రాజు, ఎడ్ల శ్రీను పాల్గొన్నారు.

**నూతన్‌కల్:** మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్, ఉపాధ్యాయులు బొక్క వీరారెడ్డి, ఎం.దీన్‌దయాళ్‌రెడ్డి, ఎం.సోమిరెడ్డి, మంజుల, శ్యాం, శరత్, పూర్వ విద్యార్థులు ఉపేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, దేవేందర్, రాజశేఖర్, చంద్రయ్య, లక్ష్మణ్, ఉమ, కవిత తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## రంగారావు చూపిన మార్గం ఆచరణీయం



సూర్యాపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

**సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 29:** కార్మిక నాయకుడు పెద్దిరెడ్డి రంగారావు చూపిన మార్గం ఆచరణీయమని మాజీ మంత్రి ,ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పెద్దిరెడ్డి రంగారావు వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. ఎందరో కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు రంగారావు అని అన్నారు. కార్మికుడిగా, పారిశ్రామికవేత్తగా, పేదలకు రంగారావు ఎంతో సేవ చేశారన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల పక్షాన రంగారావు నిస్వార్థంగా పోరాటాలు చేశారన్నారు. మిల్లు డ్రైవర్‌గా జీవితాన్ని ప్రారంభించి, పారిశ్రామికవేత్తగా, కమ్యూనిస్టు నాయకుడిగా పేదల గుండెల్లో చిరస్థాయిగా కొలువై ఉంటారన్నారు. ఈ సభలో రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, శాసన మండలి మాజీ సభాపతి నేతి విద్యాసాగర్, సీపీఐ కేంద్ర సభ్యుడు , కేవీఎల్, రాష్ట్ర నాయకుడు బొమ్మగాని ప్రభాకర్, మునిసిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, నాయకులు వై.వెంకటేశ్వర్లు, నెమ్మాదివెంకటేశ్వర్లు, గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, గండూరి ప్రకాష్, పెద్దిరెడ్డిగణేష్, పెద్దిరెడ్డి రాజా, వెంకటకృష్ణ, ప్రసాద్, మధు, చంద్రశేఖర్ అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్, రవీందర్, చంద్రశేఖర్, జనార్దన్, సూర్యనారాయణ, సత్తిరెడ్డి, శాంతయ్య, సైదులు, శంకర్, రమేష్, జ్యోతికర్ణాకర్ పాల్గొన్నారు.

## కుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ పోరాడాలి




మాట్లాడుతున్న మందారి డేవిడ్‌కుమార్

**ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 29:** కుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ పోరాడాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోసహపంక్తి బోజనాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 1873లో మహాత్మా జ్యోతిరావుపూలే కుల, మతాలను నిర్మూలించాలని సత్యశోధక్ స్థాపించి మహిళలకు, అన్ని వర్గాల వారికి విద్యను అందించారన్నారు.

ఈ కార్యక్రమంలో గునగంటి శ్రీను, గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, అల్లుబెల్లి వెంకట్‌రెడ్డి, జలగం మల్లేష్, కంచర్ల నర్సమ్మ, డేగల వెంకటకృష్ణ, బొల్లె వెంకన్న, ములకలపల్లి సైదులు, గఫార్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెస్ అండర్-15లో రమ్యకు ప్రథమ స్థానం

**హుజూర్‌నగర్, సెప్టెంబరు 29:** పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో ఆదివారం అండర్-15 చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ పధాన కార్యదర్శి పారుపల్లి చంద్రశేఖర్ ప్రారంభించారు. అండర్-7, 9, 11, 13, 15 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 124మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా అండర్-15 విభాగంలో వై.రమ్య, అండర్-13లో ఎం.దీక్షిత, అండర్-11లో వై.రక్షిత్‌చారి, అండర్-9లో బి.శ్రీవాత్సవ్, అండర్-7లో బి.సాయి కార్తికేయ ప్రథమ స్థానం సాధించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, నర్సింహారావు, జనార్దన్‌రెడ్డి, వీరమల్లు, యాదగిరి, సత్యనారాయణ, కుమారస్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాడికల్ చెస్ అకాడమికి చెందిన చెస్ క్రీడాకారిణి దివ్యభవానిని జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్

## పురుషోత్తమ్‌రెడ్డి మృతదేహానికి పలువురి నివాళి



నివాళులర్పిస్తున్న వెంకటరత్నంబాబు

**హుజూర్‌నగర్, కోదాడ టౌన్, సెప్టెంబరు 29:** నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి మృతదేహానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురుషోత్తమ్‌రెడ్డి మృతికి టీపీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు, హుజూర్‌నగర్ బార్‌అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి, హుజూర్‌నగర్ మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యరగాని నాగన్న, సాముల శివారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, కౌన్సిలర్లు సతీష్, భాస్కర్, నాగేశ్వరరావు, నిజాముద్దీన్, కట్టా గోపాల్‌రావు, తదితరులు సంతాపం తెలిపారు.

● అదే విధంగా హైదరాబాద్‌లో పురుషోత్తమ్‌రెడ్డి మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్నేని వెంకటరత్నంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ పురుషోత్తమ్‌రెడ్డి మృతి చెందడం బాధాకరమన్నారు. పురుషోత్తమ్‌రెడ్డి మృతికి రావెళ్ల కృష్ణారావు, వేమూరి విద్యాసాగర్, చింతలపాటి శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.

## డప్పు కళాకారుడు సతీష్‌కు 'అక్షర' ప్రతిభ పురస్కారం

**గరిడేపల్లి, తుంగతుర్తి, సెప్టెంబరు 29:** గరిడేపల్లి మండంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమరవరపు సతీష్, తుంగతుర్తి మండలంలోని వెంపటి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మల్లెపాక రవీందర్ 'అక్షర' ప్రతిభ పురస్కారం అందుకున్నారు. సాంస్కృతిక విభాగంలో సతీష్‌కు, ఉత్తమ ఉపాధ్యాయుడి విభాగంలో రవీందర్‌కు రాష్ట్ర స్థాయి 'అక్షర' ప్రతిభ పురస్కారాన్ని 'అక్షర' ఫౌండేషన్ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ వ్యాపారి మీలా వాసుదేవ్, 'అక్షర' ఫౌండేషన్ చైర్మన్ యాస రామ్‌కుమార్ అందజేశారు. ఈ అవార్డు రావడంపై సతీష్‌ను కుటుంబ సభ్యులతో పాటు జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుండ్ల ఆంజనేయులు, వెన్నెల నాగరాజు,వీరునాయుడు, ఉప్పల నాగార్జున అభినందించారు.

## గుంత తవ్వారు.. మరమ్మతు మరిచారు

● ప్రజలకు శాపంగా అధికారుల నిర్లక్ష్యం



మఠంపల్లిలో రోడ్డుపై తవ్వి వదిలేసిన గుంత, దారి అడ్డుగా పోసిన మట్టి

భగీరథ పైపు లీకేజీని అరికట్టడానికి అధికారులు నెల రోజుల క్రితం గుంతను తవ్వి పైపులను జాయింట్ చేయనందున నీరంతా వృథా పోతోంది. అంతేకాకుండా గుంతను తవ్వగా వచ్చిన మట్టిని రోడ్డు మీద పోయడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మఠంపల్లి- జాన్‌పహాడ్, మఠంపల్లి- హుజూర్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి కూడలిలో మండల కేంద్రంలోని చేపల మార్కెట్ వెళ్లే రహదారిలో నెల రోజుల క్రితం డీఐ పైపుల లీకేజీని అరికట్టడానికి మిషన్ భగీరథ అధికారులు పెద్ద గుంత తవ్వి, ఆ మట్టిని పక్కనే ఉన్న రహదారిపై పోశారు. నేటి వరకు మరమ్మతు చేయలేదు. గుంతనూ పూడ్చలేదు. రోడ్డు పక్కన గుంత, పక్కనే మట్టి కుప్ప ఉండటంతో ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించడానికి వాహనదారులు, విద్యార్థులు, పింఛను కోసం పోస్టాఫీసుకు వచ్చే వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. పైపులకు మరమ్మతు చేయాలంటే మట్టపల్లిలోని పంప్‌హౌస్ సమీపంలో నీటి వాల్వ్‌ను కట్టేయాలి. నెల రోజుల నుంచి ఈ పనిని మిషన్ భగీరథ అధికారులు పెండింగ్‌లో ఉంచినందున సమస్య పరిష్కారం కాలేదు. గంతలో నీరు నిల్వ ఉండి ధ్వంసమైన పైపుల ద్వారా నీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ జయచంద్రను వివరణ కోరగా పైపులైను పనులను త్వరతగతిన మరమ్మతు చేయించి, గుంతను పూడ్చిస్తామన్నారు.

● మఠంపల్లి

## నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు ముస్తాబు

● తీర్చిదిద్దుతున్న ఇతర రాష్ట్రాల కార్మికులు



**కోదాడ రూరల్, సెప్టెంబరు 29:** దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. మండలంలోని తమ్మర, కొమరబండ గ్రామాల శివారుల్లో బీహార్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు మూడు నెలలుగా విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. అక్టోబరు మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించన్ను దేవీ శరన్నవ రాత్రులు సందర్భంగా గత ఏడాది కన్నా, ఈ ఏడాది అధికంగా అమ్మవారి విగ్రహాలను తయారు చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో ఈ ఏడాది వినాయక చవితి పండుగకు గణేష్ విగ్రహాలు అనుకున్న స్థాయిలో విక్రయించలేకపోయామని విక్రయదారులు తెలిపారు. గిరాకీ తగ్గినందున తక్కువ ధర కూడా విగ్రహాలను విక్రయించాల్సి వచ్చిందని, దీంతో తాము తీవ్రంగా నష్టపోయా మన్నారు. ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుంటే నవరాత్రులు ఉత్సవాలకు అమ్మవారి విగ్రహాలను పెద్ద సంఖ్యలో విక్రయించడానికి అవకాశం ఉంటుం దన్నారు. విగ్రహాల తయారీకి వినియోగించే రంగులు, ఆస్‌బెస్టాస్ సిమెంట్ గతంలో తక్కువ ధరకు లభించేవని, ఆ సమయంలో రూ.వేయి నుంచి రూ.10వేల వరకు విగ్రహాలను విక్రయించేవారమన్నారు. ఈ ఏడాది ధరలు విపరీతంగా పెరిగినందున ఒక్కో విగ్రహాన్ని రూ.5వేల నుంచి రూ.20వేల వరకు విక్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. విగ్రహాలు కొనుగోలు కోసం పలు గ్రామాల నుంచి భక్తులు అడ్వాన్స్‌లు ఇచ్చి వెళుతున్నారన్నారు. కోదాడ ప్రాంతంలో ఈ ఏడాది విక్రయించడానికి 500లకు పైగా విగ్రహాలు తయారు చేస్తున్నామ న్నారు. గ్రామాల్లో వినాయక నవరాత్రుల ఉత్సవాల మాదిరిగా దేవీశరన్నవరాత్రులను నిర్వహించే నూతన ఒరవడి పెరుగుతోందన్నారు. మొత్తం 12రకాల్లో మూడు అడుగుల నుంచి 20అడుగుల వరకు విగ్రహాలను తయారు చేశామన్నారు. రంగులు లేకుండా కొన్ని విగ్రహాలను తయారు చేశామని, వీటిని తక్కువ ధరకు భక్తులకు అందిస్తామన్నారు. ఈ విగ్రహాల తయారీ కోసం 30కుటుంబాల సభ్యులు మూడు నెలలుగా శ్రమిస్తున్నామని, తయారు చేసిన విగ్రహాలన్నీ విక్రయిస్తే గతంలో వచ్చిన నష్టం నుంచి బయటపడతామని కార్మికులు తెలిపారు.




**సూర్యాపేట అర్బన్:** పాఠశాల పరిరక్షణకు, విద్యాభివృద్ధికి కృషి చేస్తానని సూర్యాపేట ఎంఈవో శేషగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఆయనను శ్రీసరస్వతి విద్యాపీఠం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు యానాల వెంకట్‌రెడ్డి, గుండా రమేష్, పీవీ లక్ష్మీనారాయణ, ప్రభాకర్, పర్వతం శ్రీధర్, గజ్జల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

**పెన్‌పహాడ్:** మండలంలోని దోసపహాడ్, అనాజీపురం గ్రామాల సీపీఎం కార్యదర్శులనుఎన్నుకున్నట్లు మండల కార్యదర్శి రణపంగి కృష్ణ తెలిపారు. దోసపహాడ్ సీపీఎం గ్రామ కార్యదర్శిగా బోగరాజు శ్రీకాంత్, అనాజీపురం గ్రామ సీపీఎం కార్యదర్శిగా వెంపటి లక్ష్మయ్యను ఎన్నుకున్నామన్నారు. ఈ సమావేశంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, వీరబోయిన రవియాదవ్, ముత్తయ్య, చంద్రయ్య, పుల్లయ్య, దేవయ్య, సైదులు, మల్లయ్య పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్:** నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా ఆశయాలు సాధించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాముల శివారెడ్డి కోరారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా పట్టణంలోని టౌన్‌హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కస్తాల శ్రావణ్, మాతంగి ప్రభాకర్‌రావు, సైదులు, వీరబాబు, అశోక్, నాగేశ్వరరావు, గురవయ్య, సైదులు, రాము, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

**నేరేడుచర్ల:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నగేష్, తిరుపతయ్య, నీలా రాంమ్మూర్తి, అనగంటి మీనయ్య, హఫీజ్, ఎడ్ల సైదులు, సట్టు శ్రీను పాల్గొన్నారు.

● నేరేడుచర్లలో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ ఉత్సవమూర్తులను వైభవంగా ఊరేగించారు. విగ్రహాల ప్రతిష్ఠ జరిగి 41రోజులు పూర్తైన సందర్భంగా ప్రత్యేక పూజ, పడి పూజ కార్యక్రమంలో నిర్వహించారు. అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై మేళతాళాల మోగిస్తూ, బాణసంచా పేల్చుతూ పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి, కొణతం చినవెంకటరెడ్డి, నాగండ్ల శ్రీధర్, గురుస్వామి, చిన్నపల్లి శ్రీనివాస్, సురేష్, కిషోర్, దుర్గారావు, డీవీ రమణారెడ్డి, లక్ష్మారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, గజ్జల కోటేశ్వరావు, ఐల శ్రీను, శావయ్య, రాము, కిషన్ తదితరులు పాల్గొన్నారు

**కోదాడ:** మున్నూరు కాపు సంఘం కోదాడ పట్టణ మహిళా కమిటీని ఎన్నుకున్నట్లు నూనె సులోచన, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ్ల ప్రశాంతి, పట్టణ అధ్యక్షుడు సన్నీరు మురళి తెలిపారు. అధ్యక్షురాలిగా రామిశెట్టి కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలిగా ఎం.శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా కోట గురులక్ష్మిని ఎన్నుకుని నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, చింతలపాటి అరుణ బండారు ఉమ, ఓరుగంటి రమణ, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

**నూతన్‌కల్:** నకిరేకల్‌కు చెందిన పుష్పలత అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స కోసం డబ్బులు లేక ఇబ్బంది పడుతుండడంతో విషయం తెలుసుకున్న జనం కోసం మనం సభ్యులు ఆదివారం నూతన్‌కల్‌లో బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. సాయం అందించిన వారిలో రేసు రవి, గడ్డం జానయ్య, గంట నాగయ్య, ఊడుగుల మురళి తదితరులు ఉన్నారు.